E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 30-8-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

# భారత్, చైనా కలిసి పనిచేయాలి



తరువాయి 2లో

» ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు ఇది అవసరం
» జపాన్ మీడియాతో ఇంటర్వ్యూలో మోదీ వ్యాఖ్యలు
» మేకిన్ ఇండియా కోసం రండి.. ప్రపంచం కోసం
» తయారు చేయండి.. పెట్టుబడులకు గమ్యం భారత్
» భారత్‌జపాన్ ఆర్థిక సదస్సులో ప్రధాని మోదీ
» భారత్‌లో పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే
» జపాన్ లక్ష్యం.. ఇరుదేశాల కీలక ఒప్పందాలు


ఈకబురు, టోక్యో, ఆగస్టు 29: ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచాలంటే భారత్, చైనా కలిసి పనిచేయడం అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం ఆధారంగా ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జపాన్ వెళ్లిన మోదీ.. శుక్రవారం స్థానిక పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య స్థిరమైన, బలమైన బంధాలు ఉండాలని.. ఆ ప్రభావం ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సౌభ్రాతృత్వంపైనా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో సంబంధాలు మెరుగుపర్చుకోవడంపై అడిగిన ప్రశ్నకు మోదీ స్పందిస్తూ.. ''చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనడానికి తియాంజిన్ వెళ్తున్నా. గత ఏడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యాను. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో స్థిరమైన, సానుకూల పురోగతి ఉంది'' అని చెప్పారు. ఇరుదేశాల మధ్య దృఢమైన బంధం ఆసియాకే గాక యావత్ ప్రపంచానికే కీలకమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అస్థిరంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జపాన్ ప్రభుత్వ 'స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్' విధానంపై స్పందిస్తూ.. ఈ విధానానికి, భారత్ 'విజన్ మహాసాగర్'కు సారూప్యత ఉందని మోదీ చెప్పారు. ప్రపంచం కోసం తయారు చేయండి..ప్రధాని మోదీ భారత్‌జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగిస్తూ.. మేకిన్ ఇండియా కోసం రావాలని, ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ పరిశ్రమల నుంచి స్టార్ట్‌పల వరకూ భారత్‌కు జపాన్ అత్యంత కీలక భాగస్వామిగా ఉందని చెప్పారు. జపాన్ సంస్థలు భారత్‌లో రూ.3.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. ''ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది'' అని మోదీ పేర్కొన్నారు. జపాన్ సాంకేతికత, భారతీయుల ప్రతిభ కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవాన్ని ముందుకు నడిపించగలవని అన్నారు. ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ రైలు భారత్, జపాన్‌ల మధ్య ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని ప్రధాని మోదీ చెప్పారు. మరికొన్ని ఏళ్లలోనే రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

# నేటి నుంచి అసెంబ్లీ

» తొలి రోజు మాగంటి గోపీనాథ్‌కు నివాళి
» అనంతరం బీఏసీ సమావేశం
» తర్వాత కమిటీ హాల్లో మంత్రివర్గ భేటీ
» స్థానికంలో బీసీలకు 42 రిజర్వేషన్లపై చర్చ
» జీవో ఇచ్చి ముందుకు వెళ్లే అవకాశం?
» 40 రోజుల్లో ముగియనున్న ఎన్నికల ప్రక్రియ!
» 'కాళేశ్వరం' నివేదికపైనా అసెంబ్లీలో చర్చ!

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవగానే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాప ప్రతిపాదన చేస్తారు. దానిపై సభ్యులు మాట్లాడతారు. అలాగే శాసనమండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాగం రంగారెడ్డి, టి.రత్నాకర్‌ల మృతికి సంతాప ప్రతిపాదనపై సభ్యులు మాట్లాడతారు. అనంతరం ఉభయ సభలూ వాయిదా పడనున్నాయి. తర్వాత శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీ కానుంది. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే అంశాలపై చర్చించాలన్నదానికి సంబంధించిన అజెండాను ఖరారు చేయనున్నారు. అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్లో సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, ఇతర విధానపరమైన అంశాలపైచర్చించనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42ు రిజర్వేషన్లు, కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన విచారణ నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42ు రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లపై ఉన్న 50ు పరిమితిని ఎత్తివేస్తూ ఆర్డినెన్సు తీసుకొచ్చిన సర్కారు.. ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పంపింది. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారు. బీసీలకు ప్రస్తుతం 23 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచి, స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 69 శాతం మేరకు అమలు చేస్తూ సవరణ బిల్లును అసెంబ్లీలో చర్చకు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని పార్టీలూ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో శాసనసభలో ఆమోదం లభిస్తుందని, వెంటనే బిల్లు ఆధారంగా ఉత్తర్వులు జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ఏర్పాటైన మంత్రుల కమిటీ..

తరువాయి 2లో



## భయం గుప్పిట్లో భాజపా నేతలు



ఈ-కబురు, సీవాన్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ సాయంతో ఓట్ల చోరీకి పాల్పడుతూ పట్టుబడిన నేపథ్యంలో భాజపా నేతలు భయోత్పాతానికి గురవుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు.

» 3లో

## అందుకే అతడిని నా భర్త అని చెప్పాను: జాన్వీకపూర్

» 5లో



## ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ ఉర్జిత్

» 4లో



## సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్.. ఫొటోలు వైరల్

» 5లో



## నిరూపించుకోవడానికి ఏమీలేదు.. అదే నా విజయ సూత్రం: పీవీ సింధు

» 6లో



## సుప్రీం జడ్జీల పదవీ ప్రమాణం

» 3లో



## ఉత్తరాది రాష్ట్రాల్లో వర్ష బీభత్సం



ఉత్తరాఖండ్‌లో అయిదుగురి మృతి.. 11 మంది గల్లంతు
కాశీలో ఇళ్లపై దహన సంస్కారాలు, నీట మునిగిన పంజాబ్

తరువాయి 3లో

## రాహుల్ సభపై దుమారం



ప్రధాని మోదీ తల్లిపై కొందరు దుర్భాషలాడినట్టు ఆరోపణలు
బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ
పట్నాలో రాహుల్ గాంధీపై కేసు
రాహుల్ క్షమాపణ చెప్పాలన్న షా
ఓటర్ అధికార్ యాత్రకు బ్రహ్మరథం అందుకే బీజేపీ కుట్రలు: కాంగ్రెస్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న బిహార్ దర్భంగా ఓటర్ అధికార్ యాత్ర సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ తల్లిని కొందరు దూషించడంపై కలకలం రేగుతోంది....

» 2లో

## అసెంబ్లీకి ఈసారీ.. కేసీఆర్ డుమ్మా!



» 2లో

## ట్రంప్‌నకు భారీ ఎదురుదెబ్బ.. టారిఫ్‌లు చట్ట విరుద్ధం: యూఎస్ కోర్టు తీర్పు



» 3లో

# అన్ని విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు హాజరు




బోధనా సిబ్బంది, విద్యార్థులకు తప్పనిసరి..
గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండాలి
సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈకబురు, హైదరాబాద్: పాఠశాలల నుంచి వర్సిటీల వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలని, అందుకు అనుగుణంగా బోధనా సిబ్బందితోపాటు విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు (ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్‌ఎఫ్‌ఆర్ఎస్) విధానాన్ని తప్పనిసరి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరుశాతం మెరుగుపడుతుందని, వివిధ లోటుపాట్లనూ అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై.. సీఎం మూడు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. విద్యారంగంపై చేస్తున్న ఖర్చును వ్యయంగా కాకుండా...పెట్టుబడిగా చూస్తున్నామని ఈ సందర్భంగా సీఎం స్పష్టంచేశారు.

తరువాయి 2లో

## మేకిన్ ఇండియా కోసం రండి.. ప్రపంచం కోసం తయారుచేయండి: ప్రధాని మోదీ



ఈ-కబురు, టోక్యో: ప్రధాని నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సు లో ఆయన ప్రసంగించారు. మేకిన్ ఇండియా కోసం రావాలని.. ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు.

» 2లో

మొదటి పేజీ తరువాయి

# నేటి నుంచి అసెంబ్లీ



స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు, కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన విచారణ నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేస్తూ ఆర్డినెన్సు తీసుకొచ్చిన సర్కారు.. ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పంపింది. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారు. బీసీలకు ప్రస్తుతం 23 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచి, స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 69 శాతం మేరకు అమలు చేస్తూ సవరణ బిల్లును అసెంబ్లీలో చర్చకు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.అన్ని పార్టీలూ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో శాసనసభలో ఆమోదం లభిస్తుందని, వెంటనే బిల్లు ఆధారంగా ఉత్తర్వులు జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ఏర్పాటైన మంత్రుల కమిటీ.. రాజ్యాంగ, న్యాయ నిపుణులను సంప్రదించినప్పుడు చట్ట పరంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తే ఇదే మెరుగైన ప్రత్యామ్నాయమని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. మరరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులపై రాష్ట్రపతి 90 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై సుప్రీంకోర్టు తుది తీర్పు కోసం వేచి చూడడం, పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ఎన్నికలకు వెళ్లడం అన్న ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. చట్ట సవరణతో జీవో ఇవ్వడం ద్వారా ముందుకు వెళ్లాలని భావిస్తే.. ఉత్తర్వులు వెలువడిన పది రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల కమిషన్‌కు సమర్పించనుందని, ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, మొత్తం 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అంటున్నాయి. అయితే, ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం, ఎవరైనా కోర్టుకు వెళ్లే అవకాశం ఉండడం గండాలని పేర్కొంటున్నాయి.

**వాడీవేడిగా సమావేశాలు**

బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరంపై కమిషన్ విచారణ నివేదికలపై అసెంబ్లీలో చర్చ జరిగే అవకాశం ఉన్నందున.. ఈ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. కేసీఆర్ కేంద్రీకృతంగానే పీసీ ఘోష్ కమిటీ నివేదిక ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన సమాధానం ఇచ్చేందుకు సమావేశాలకు వస్తారా? లేక దుమ్మా కొడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు కమిషన్ నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి లేదా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల్లో ఎవరో ఒకరు సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో శాసనసభ వేదికగా బీజేపీని దోషిగా నిలబెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు సమాయత్తమవుతోంది. అలాగే రాష్ట్రంలో వరద పరిస్థితులు, యూరియా కొరతపైనా చర్చకు ప్రతిపక్షాలు పట్టుపట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పోలీసు శాఖ, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు కూడా అధికారులు సంపూర్ణంగా సహకరించాలని స్పీకర్ కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని త్వరగా అందించాలన్నారు. సమావేశాలు సజావుగా జరిగేలా పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శాసనమండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నోడల్, లైజనింగ్ అధికారులను నియమించాలని కోరారు.

**బీఆర్‌ఎస్‌లో వణుకు మొదలైంది.. కాళేశ్వరంపై చర్చతో బండారం బయటపడుతుంది: ఆది శ్రీనివాస్**

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ నివేదికపై అసెంబ్లీలో చర్చ అనగానే బీఆర్‌ఎస్‌లో వణుకు మొదలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అందుకే అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతివ్వాలంటూ ఆ పార్టీ అడుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతివ్వాలంటూ అప్పటి సీఎల్పీ కోరితే పట్టించుకోలేదని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ఠ గంగలో కలిసిపోయిందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగితే తమ బండారం బయటపడుతుందనే భయంలో బీఆర్ఎస్ నాయకత్వంలో ఉందన్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తుందని, ఆ సమావేశాల్లో బీఆర్ఎస్ నేతలు అన్ని విషయాలూ చెప్పుకోవచ్చని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## మేకిన్ ఇండియా కోసం రండి..



సెమీకండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “80 శాతం కంపెనీలు భారత్‌లో తమ సంస్థలను విస్తరించాలని కోరుకుంటున్నాయి. 75 శాతం కంపెనీలు ఇప్పటికే లాభాల్లో ఉన్నాయి. భారత్‌లో మూలధనం ఎన్నో రెట్లు పెరుగుతోంది. గత 11 ఏళ్లలో భారత్‌లో గతంలో ఎన్నడూ లేని మార్పులు చోటుచేసుకున్నాయి. రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వచ్చాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది” అని మోదీ పేర్కొన్నారు.ఈ పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని ఇషిబాతో మోదీ భేటీ కానున్నారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా వీరి మధ్య ద్వైపాక్షిక చర్చ జరగనుంది. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణల అనంతరం ప్రధాని మోదీ చైనాను సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి.

మొదటి పేజీ తరువాయి

# భారత్,చైనా కలిసి పనిచేయాలి





ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అస్థిరంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జపాన్ ప్రభుత్వ ‘స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్’ విధానంపై స్పందిస్తూ.. ఈ విధానానికి, భారత్ ‘విజన్ మహాసాగర్’కు సారూప్యత ఉందని మోదీ చెప్పారు.

ప్రపంచం కోసం తయారు చేయండి..

ప్రధాని మోదీ భారత్‌జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగిస్తూ.. మేకిన్ ఇండియా కోసం రావాలని, ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ పరిశ్రమల నుంచి స్టార్ట్‌పల వరకూ భారత్‌కు జపాన్ అత్యంత కీలక భాగస్వామిగా ఉందని చెప్పారు. జపాన్ సంస్థలు భారత్‌లో రూ.3.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది” అని మోదీ పేర్కొన్నారు. జపాన్ సాంకేతికత, భారతీయుల ప్రతిభ కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవాన్ని ముందుకు నడిపించగలవని అన్నారు. ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ రైలు భారత్, జపాన్‌ల మధ్య ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని ప్రధాని మోదీ చెప్పారు. మరికొన్ని ఏళ్లలోనే రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మరోవైపు, చంద్రుడిపై పరిశోధనల కోసం చేపడుతున్న చంద్రయాన్5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందుకోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు ఇస్రో, జాక్సాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.

పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు

భారత్‌లో రాబోయే పదేళ్లలో దాదాపు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కీలక గనులు, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ తెలిపారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, స్వచ్ఛ ఇంధనం, టెలికం, ఫార్మా, సరికొత్త, అధునాతన సాంకేతికత తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య 13 ఒప్పందాలు జరిగాయి.

చైనాలో జిన్‌పింగ్, పుతిన్‌తో భేటీ

జపాన్ పర్యటనను ముగించుకొని మోదీ చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న తియాంజిన్‌లో జరిగే ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అక్కడ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత మోదీ చైనా పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి. మరోవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం మోదీతో సమావేశమనున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అలాగే, డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా చమురును కొంటున్నందుకే ట్రంప్ భారత్‌పై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

# అన్ని విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు హాజరు



ఈకబురు, హైదరాబాద్: పాఠశాలల నుంచి వర్సిటీల వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలని, అందుకు అనుగుణంగా బోధనా సిబ్బందితోపాటు విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని తప్పనిసరి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరుశాతం మెరుగుపడుతుందని, వివిధ లోటుపాట్లనూ అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై.. సీఎం మూడు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. విద్యారంగంపై చేస్తున్న ఖర్చును వ్యయంగా కాకుండా... పెట్టుబడిగా చూస్తున్నామని ఈ సందర్భంగా సీఎం స్పష్టంచేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలు...నిర్ణయాలు ఇవీ...

విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదు. నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం అన్నీ ఒకే విభాగం కింద ఉండాలి. సమీకృత గురుకులాల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న తెలంగాణ విద్యా సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ(టీజీఈడబ్ల్యూఐడీసీ) నేతృత్వంలోనే ఇకపై నిర్మాణ పనులు కొనసాగాలి. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సమకూర్చాలి.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి. కంటైనర్లపైన సౌర పలకలు ఏర్పాటుచేసి, అవసరమైన విద్యుత్తు వినియోగించుకోవచ్చు.

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు గ్రీన్ ఛానల్‌లో జరగాలి. బిల్లుల సమర్పణ కూడా ఆన్‌లైన్‌లోనే సాగాలి. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద బడుల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు, ‘మన ఊరుమన బడి’ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

రాష్ట్రంలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.

**ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. అవసరమైతే కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలి.**

మొదటి పేజీ తరువాయి

# అసెంబ్లీకి ఈసారీ.. కేసీఆర్ డుమ్మా!



ఈకబురు, ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రకారం.. ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ అధికార కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో.. అసెంబ్లీలో ఈ అంశంపై జరిగే చర్చకు హాజరు కాకూడదని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఆయన శాసనసభకు హాజరైతే.. కాళేశ్వరం నివేదికలోని అంశాల ఆధారంగా ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు ఆయన ఏం సమాధానం చెబుతారు? సభలో ఏం మాట్లాడతారన్న దానిపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ముఖ్యనేతలు శుక్రవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై వారికి కేసీఆర్ సూచనలు చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికలోని ఏయే అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు పెడుతుంది, వాటికి సభలో ఏం సమాధానం చెప్పాలి, ప్రజలకు ఎలా వివరించాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ ప్రధాన ఎజెండాగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో.. కాళేశ్వరం విషయంలో నిజానిజాలను అసెంబ్లీ వేదికగా బహిర్గతం చేద్దామని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేస్తున్న అసత్యాలను ప్రజలకు తెలియబరచాలని, వాస్తవాలను వివరించాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు చెప్పారని, అదే రీతిలో అసెంబ్లీలోనూ కాళేశ్వరం ద్వారా ప్రజలకు జరిగే లబ్ధి తెలిసేలా చూడాలని అన్నట్లు తెలిసింది. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు. అయితే ఇందుకు స్పీకర్ అనుమతిస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. ఇక అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్రంలో యూరియా కొరత, వరదల అంశం, సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యం అంశంపై ప్రశ్నించాలని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించినట్లు తెలిసింది.

# రాహుల్ సభపై దుమారం

ఈకబురు, న్యూఢిల్లీ, ఆగస్టు 29: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న బిహార్ దర్భంగా ఓటర్ అధికార్ యాత్ర సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ తల్లిని కొందరు దూషించడంపై కలకలం రేగుతోంది. మోదీ మాతృమూర్తిని హిందీలో దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఘటన నేపథ్యంలో రాహుల్‌పై బిహార్ బీజేపీ నేత కృష్ణ సింగ్ ఫిర్యాదుతో పట్నాలో కేసు నమోదు చేశారు. బీజేపీ దర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆదిత్య నారాయణ్ ఇచ్చిన మరో ఫిర్యాదుతో పోలీసులు దర్భంగాలోని సింఘ్వారా ప్రాంతానికి చెందిన మహ్మద్ రిజ్వీ అనే 20 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. వేదికపైనుంచి మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిలో రిజ్వీ కూడా ఉన్నారని బీజేపీ నేతలు కేసు పెట్టారు. మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పాట్నాలో బీజేపీకాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసరగా, బీజేపీ కార్యకర్తలు పార్టీ జెండా కర్రలు విసిరారు. దీంతో సదాఖత్ ఆశ్రమ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మోదీ తల్లిపై దూషణ నేపథ్యంలో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయని షా వ్యాఖ్యానించారు. మోదీ తల్లి పేదరికంలో నుంచి వచ్చినా విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారని షా చెప్పారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండటాన్ని కాంగ్రెస్ జీర్ణం చేసుకోలేకపోతోందన్నారు. మోదీ తల్లిని దూషిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఉపయోగించిన భాష అసభ్యకరంగా ఉందని బిహార్ సీఎం నితీశ్ ఖండించారు. కాగా, ఓటర్ అధికార్ యాత్ర నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని జైరాం రమేశ్ అన్నారు.



మొదటి పేజీ తరువాయి

# ట్రంప్‌నకు భారీ ఎదురుదెబ్బ.. టారిఫ్‌లు చట్ట విరుద్ధం: యూఎస్ కోర్టు తీర్పు



ఈకబురు, వాషింగ్టన్: టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నకు భారీ ఎదురుదెబ్బ. ట్రంప్ విధించిన సుంకాలు చాలా వరకు చట్ట విరుద్ధమని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ తన ఆర్థిక అధికారాలను అతిక్రమించి అధికంగా టారిఫ్‌లను విధించినట్లు పేర్కొంది. 74 తేడాతో అప్పీల్స్ కోర్టు న్యాయమూర్తులు ఈ తీర్పు వెలువరించారు. భారీగా విధించిన సుంకాలు పలు దేశాలను ప్రభావితం చేశాయని కోర్టు పేర్కొంది. ప్రస్తుతానికి ఆ టారిఫ్‌లను అక్టోబర్ నెల మధ్య నాటికి కొనసాగించడానికి న్యాయమూర్తులు అనుమతి ఇచ్చారు. దీంతో ఈ నిర్ణయాన్ని యూఎస్ సుప్రీంకోర్టులో సవాలు చేసేందుకు కోర్టు అనుమతించింది. ఈ నిర్ణయంపై కోర్టును ట్రంప్ విమర్శించారు. ఈమేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు చేశారు. "అన్ని దేశాలపై విధించిన సుంకాలు ప్రస్తుతం అమల్లో ఉన్నాయి. వాణిజ్య భాగస్వాములపై విధించిన సుంకాలను తొలగించాలని పక్షపాత అప్పీళ్ల కోర్టు తీర్పు చెప్పింది. ఈ ప్రక్రియలో చివరకు అమెరికా విజయం సాధిస్తుంది. ఒకవేళ ఈ టారిఫ్‌లను తొలగిస్తే దేశ చరిత్రలోనే ఒక విపత్తు అవుతుంది. అమెరికా మరింత బలపడాలి. కానీ ఈ నిర్ణయం దేశాన్ని ఆర్థికంగా బలహీనపరుస్తుంది. వాణిజ్య లోటును పూడ్చడానికి, విదేశీ వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవడానికి సుంకాలు ఇప్పటికీ అత్యుత్తమ మార్గం. మన తయారీదారులను, రైతులను అణగదొక్కేందుకు మిత్ర దేశాలైనా, శత్రుదేశాలైనా అనైతికంగా విధించే టారిఫ్‌లు, అపారమైన వాణిజ్య లోటు, వాణిజ్య అడ్డంకులను అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ఒకవేళ టారిఫ్‌లు ఎత్తివేస్తే ఈ నిర్ణయం అమెరికాను నాశనం చేస్తుంది. మన కార్మికులకు సహాయం చేయడానికి ఇదొక్కటే సరైన మార్గం అని గుర్తుపెట్టుకోవాలి. అమెరికా ఉత్పత్తులను తయారు చేస్తున్న మన కంపెనీలకు మద్దతుగా నిలబడాలి. చాలా ఏళ్లుగా మన రాజకీయ నాయకులు టారిఫ్‌లను మనకు వ్యతిరేకంగా ఉపయోగించారు. యూఎస్ సుప్రీంకోర్టు సహాయంతో టారిఫ్‌లను మన దేశ ప్రయోజనాల కోసం ఉపయోగించి అమెరికాను బలమైన, ధనిక, శక్తివంతంగా మారుస్తాను" అని ట్రంప్ పేర్కొన్నారు.

# వరద బాధితుల్ని రక్షిస్తున్న ఆర్మీ సిబ్బంది



**ఈ-కబురు, దరాబాద్: వరద బాధితుల్ని రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు శుక్రవారం సైతం ముమ్మరంగా కొనసాగాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో అధికారులు మూడు రోజుల వ్యవధిలో 2,482 మందిని రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సహాయక చర్యల్లో రక్షణ శాఖకు చెందిన 2 హెలికాప్టర్లను ఉపయోగించారు. సహాయక చర్యల్లో భాగంగా తమ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని అగ్నిమాపక విపత్తు నివారణశాఖ డీజీ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.**

# వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు : ఎమ్మెల్యే గాంధీ

**ఆల్విన్ కాలనీ లో నాలాల విస్తరణ పనులకు శంకుస్థాపన**



నాలా విస్తరణ, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో వరద ముంపు సమస్య నుంచి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువు ధరణి నగర్ నుండి ప్రేమ్ సరోవహర్ వరకు 8 కోట్ల 76 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులలో భాగంగా 79.58 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆర్ సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను, నాల విస్తరణ నిర్మాణం పనులకు కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎస్ఎన్డిపి ఫేస్ 2 లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 79.58 లక్షల రూపాయలతో నాలల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని, నాలాల విస్తరణతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్కప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళనతో ఇబ్బందులకు గురయ్యేవారని, కానీ నేడు ముంపు సమస్య లేకుండా.. మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యతలో నాలాల విస్తరణ పనులు చేపట్టాలని ,నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలన.. ,యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ,అధికారులకు సూచించారు. నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రధాన రహదారుల పై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ప్రజలకు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, స్థానిక కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


# చందానగర్ గౌతమి నగర్ లో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ డివిజన్ లో గల గౌతమి నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గౌతమి నగర్ కాలనీలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడికి ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక భక్తుల నుంచి పూజలు అందుకున్న గణనాథుని మండపం వద్ద సాయంత్రం నిర్వహించిన భక్తి గాన లహరి అలరించింది. దీక్షితుల సుబ్రహ్మణ్యం, శ్రీకంఠ నాయకులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గణనాథుడి మండపం వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం గణనాథుడి మహా ప్రసాదం 'లడ్డూ' వేలం పాట నిర్వహించడంతో పాటు ఉట్టి కొట్టే కార్యక్రమం కొనసాగుతుందని, అనంతరం భక్తజనుల కోలాహలం మధ్య గణనాథుడి నిమజ్జనం నిర్వహించనున్నట్లు తెలిపారు.



భక్తుల పూజలందుకుంటున్న గౌతమి నగర్ కాలనీ గణనాథుడు

# సుప్రీం జడ్జీల పదవీ ప్రమాణం



ఈకబురు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందిన బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీలు శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ వారి చేత ప్రమాణం చేయించారు. దీంతో సీజేఐతో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యాబలం 34కు చేరింది. ఇది కోర్టు పూర్తి కార్యనిర్వాహక సామర్థ్యం. కొత్తగా నియమితులైన జస్టిస్ పంచోలీ 2031 అక్టోబరులో జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ పదవీ విరమణ అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవుతారు. ఆయన 2031 అక్టోబరు 3 నుంచి 2033, మే 27 వరకూ ప్రధాన న్యాయమూర్తిగా ఉంటారు. జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలకు అత్యున్నత న్యాయస్థానం జడ్జీలుగా పదోన్నతి కల్పించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం ఈనెల 25న సిఫార్సు చేసిన విషయం విదితమే. జస్టిస్ పంచోలీ నియామకం న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, నియామక వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతం కల్పిస్తుందని కొలీజియం సభ్యురాలైన జస్టిస్ నాగరత్న అభ్యంతరం లేవదీశారు కూడా. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ అరాధే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో జన్మించారు. జస్టిస్ పంచోలీ గుజరాత్ వాస్తవ్యులు.


# భయం గుప్పిట్లో భాజపా నేతలు



ఈకబురు, సీవాన్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ సాయంతో ఓట్ల చోరీకి పాల్పడుతూ పట్టుబడిన నేపథ్యంలో భాజపా నేతలు భయోత్పాతానికి గురవుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా ఆయన సీవాన్‌లో ఒక ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. మోదీ ప్రభుత్వ ఓట్ల చోరీచేసి పట్టుబడింది కాబట్టే భాజపా నేతలు పైకి కిందికి ఎగురుతున్నారని రాహుల్ విమర్శించారు. ''ఇప్పటి వరకూ భాజపా ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడి విజయాలు సాధిస్తూ వచ్చింది. ఇప్పుడు మేం అలా జరగనీయం. గత లోక్‌సభ ఎన్నికల అనంతరం భాజపా మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో కోటి నకిలీ ఓట్లు చేర్చింది. ఈ నిజం నిరూపితమైంది కూడా'' అని ఆయన అన్నారు. దళితులు, మైనారిటీలు, మహిళలకు ఓటు వేసే హక్కుంది. కానీ ఓట్లు దొంగిలించి మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో విజయాలు సాధిస్తోంది, అని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో ఓటరు జాబితాల్లోంచి దళితులు, అతి వెనకబడిన తరగతులు, వెనకబడిన తరగతులు, పేదలు, మైనారిటీల పేర్లనే తొలగించారని ప్రతిపక్ష నేత ఆరోపించారు. ఓటు వేసే హక్కు రాజ్యాంగం ప్రసాదించిందని ఆయన అన్నారు. ఓటు హక్కు లేకుండా చేయడం ద్వారా రాజ్యాంగంపై దాడికి భాజపా పాల్పడుతోందని రాహుల్ పేర్కొన్నారు.

# చొరబాటుదార్ల నుంచి దేశాన్ని భాజపా విముక్తం చేస్తుంది

ఈకబురు, గువాహటి: అస్సాంను, దేశంలోని ఇతర ప్రాంతాలను చొరబాటుదార్ల నుంచి భాజపా విముక్తం చేస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గువాహటిలో శుక్రవారం జరిగిన అస్సాం తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి గోలాప్ బోర్బొరా శతజయంతి సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన ఉన్నతస్థాయి జనాభా స్వరూప మిషన్ దేశంలో జనాభా కూర్పును అధ్యయనం చేసి చొరబాటుదార్లను గుర్తిస్తుందని అమిత్ షా అన్నారు. తన అస్సాం పర్యటనలో భాగంగా ఆయన వచ్చే సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్న అస్సాం శాసనసభ ఎన్నికలకు సమరశంఖం పూరించారు. పంచాయత్ ప్రతినిధుల ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ ''పాకిస్థాన్‌కు తరచూ వెళ్లివచ్చే వ్యక్తులు అస్సాంకు నేతృత్వం వహించలేరు'' అని అమిత్ షా అస్సాం పీసీసీ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్‌పై విసుర్లు రువ్వారు. భాజపా నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అస్సాంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను, చొరబాటుదార్లను రక్షించే వారు రాష్ట్రానికి నేతృత్వం వహించలేరని హోం మంత్రి అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి పనుల ప్రయోజనాలను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఇంటింటికీ తీసుకెళ్లారు అని ఆయన అన్నారు. రాష్ట్రంలోని భాజపా సర్కారు వైష్ణవ మఠాలకు చెందిన భూముల్ని చొరబాటుదార్ల చెర నుంచి విడిపించిందని ఆయన గుర్తు చేశారు.



# ప్రతినెలా రూ.7వేల కోట్ల వడ్డీ చెల్లింపు అబద్ధం

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, ప్రతినెలా రూ.7వేల కోట్లను రుణాలపై వడ్డీల కోసం చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడం పచ్చి అబద్ధమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఈ అంశంపై ఆయన స్పందించారు. ''తెలంగాణ రాష్ట్రం ప్రతినెలా రూ.7వేల కోట్ల రుణవడ్డీ చెల్లిస్తోందంటూ ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని ఇటీవల కాగ్ నివేదిక స్పష్టంగా చెప్పింది. వాస్తవానికి గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తోంది. ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని ఆయన మరో ప్రకటనలో తెలిపారు. ''ఈ వర్షాలతో పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగింది. ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా.. రూ.3,50,000 కోట్లతో 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్లతో మూసీ సుందరీకరణ, రూ.225 కోట్లతో చేపట్టనున్న హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారు. ఇది ప్రజా పాలన కాదు' అని కేటీఆర్ ఆరోపించారు.



# ఉత్తరాది రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

ఈకబురు, దిల్లీ: ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో మరోసారి మేఘవిస్ఫోటంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచీ కురుస్తున్న కుండపోత వర్షాలకు అయిదుగురు మృతిచెందగా, 11 మంది గల్లంతయ్యారు. అలకనంద, మందాకిని నదుల నీటిమట్టాలు భారీగా పెరుగుతున్నాయి. కొండచరియలు విరిగిపడి పలుచోట్ల ఇళ్లు కూలడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఆగస్టు నెలలో ఈ రాష్ట్రాన్ని భారీవర్షాలు పలుమార్లు అతలాకుతలం చేశాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ నగర కుడి భూభాగం వర్షానికి కొట్టుకుపోయి నదీగర్భంలా మారింది. పర్యాటకులకు చెందిన పలు వాహనాలు ఇక్కడే నిలిచిపోయాయి. జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారి కొండచరియలు విరిగిపడుతున్న కారణంగా వరుసగా నాలుగో రోజు మూతపడింది. 2 వేలకు పైగా వాహనాలు ఈ మార్గంలో ఆగిపోయాయి. కట్రాలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వైష్ణోదేవి యాత్ర నాలుగోరోజు కూడా నిలిచిపోయింది. మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్ జిల్లాల్లో భారీవర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగ, సరయూ, వరుణా నదుల నీటిమట్టాలు భారీగా పెరిగి వరదనీరు చుట్టుముట్టడంతో వారణాసిలో ప్రముఖ ఘాట్లు, ఇళ్లు నీటమునిగాయి. మణికర్ణిక, హరిశ్చంద్ర ఘాట్ల వద్ద ఇళ్ల పైకప్పులపై దహన సంస్కారాలు జరుగుతున్నాయి. పంజాబ్‌లోని సట్లెజ్, బియాస్, రావి నదుల నీటిమట్టాలు భారీగా పెరగడంతో పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీవర్షం చండీగఢ్‌ను ముంచెత్తింది.



# రుణం ముప్పుగా మారకుండా




**పండగలు వస్తున్నాయి. ఈ సమయంలో అడగకుండానే అప్పు ఇస్తామంటూ ఫోన్లు వస్తుంటాయి. వడ్డీ లేని వాయిదాలతో ఇప్పుడు కొనండి.. తర్వాత చెల్లించండి అంటూ ఆఫర్లూ ఉంటాయి. ఇలాంటి సమయంలోనే మనం ఆర్థిక క్రమశిక్షణతో ఉండాలి. లేకపోతే అప్పుల ఊబిలో చిక్కుకుంటాం.**

అజయ్ వయసు 37. ఇద్దరు పిల్లలు. రెండేళ్ల క్రితం ఇల్లు కొన్నారు. ప్రముఖ సంస్థలో ఉద్యోగం చేస్తూ.. నెలకు రూ.లక్ష వరకూ ఆర్జిస్తున్నారు. అంతా సాఫీగానే సాగిపోతోంది అనుకుంటూ.. ఒక కారు కొన్నారు. దీంతోపాటు వ్యక్తిగత ఖర్చులకూ, ఇతర అవసరాలకూ క్రెడిట్ కార్డును తరచూ వినియోగిస్తున్నారు. వ్యక్తిగత రుణాలు సరేసరి. చూస్తుండగానే ఆదాయానికి మించి రుణ వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. మరోవైపు పిల్లలు పెరుగుతూ ఉండటంతో ఖర్చులూ అధికమవుతున్నాయి. వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో పడిపోయారు.

అజయ్ లాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్న వారు ఎందరో. ఆర్థిక సమస్యలతో సతమతం అవుతూ ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. సులువుగా రుణాలు దొరుకుతున్నాయని ప్రతి అవసరానికీ అప్పు చేయడమే దీనికి కారణం. ఆదాయం తగ్గట్టుగా ఖర్చులు పెట్టాలనే ప్రాథమిక సూత్రాన్ని మర్చిపోవడమే సమస్యగా మారుతోంది.

భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని ఇప్పుడే ఖర్చు చేసే ధోరణి పెరిగింది. కారణం ఏదైనా సరే.. ఆర్థిక ప్రణాళిక ఒక్కసారి దెబ్బతింటే తిరిగి గాడిన పడటం కాస్త కష్టమే.

**పరిమితి దాటకుండా..**

**అప్పు ఇస్తున్నారు కదా అని తీసుకోవడం కాదు. మన ఆదాయాన్ని బట్టి, రుణ వాయిదాలు ఎంత ఉండాలన్నదానికి ఒక పరిమితి ఉంటుంది.**

**మీ మొత్తం ఆదాయంలో ఇంటి రుణ వాయిదా 30 శాతానికి మించరాదు.**

**క్రెడిట్ కార్డు పరిమితిలో 40 శాతానికి మించి వాడొద్దు.**

**కారు రుణానికి ఈఎంఐ మీ ఆదాయంలో 5 శాతం లోపే ఉండాలి.**

**వ్యక్తిగత రుణాలను సాధ్యమైనంత వరకూ తీసుకోవద్దు. తీసుకున్నా మీ ఆదాయంలో 2 శాతం కన్నా తక్కువుండాలి.**

**ఇవన్నీ చూశాకే..**

రుణం తీసుకోవడం తేలికే. కానీ, దాన్ని తీర్చేందుకు కొన్ని త్యాగాలు తప్పవు.

వేతనం, వడ్డీలు, డివిడెండ్లు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయాలన్నింటికీ ఒక లెక్క ఉంటుంది. కానీ, ఖర్చులు కచ్చితంగా ఇంతే ఉంటాయని చెప్పలేం. ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించాలి.

అవసరాలు, కోరికలు, విలాసాలు.. ఈ మూడింటికి మధ్య తేడా స్పష్టంగా గుర్తించాలి. విలాసాలు ఎప్పుడూ అప్పుల ఊబిలోకి నెట్టివేస్తాయి.

అధిక వడ్డీకి రుణం తీసుకోవద్దు. 10 శాతానికి మించి వడ్డీ చెల్లిస్తున్నామంటే.. ఆ భారాన్ని మోసేందుకు మన శక్తి సరిపోదు.

ఏం చేయాలి?

అధిక వడ్డీకి తీసుకున్న రుణాలను సాధ్యమైనంత తొందరగా వదిలించుకునే ప్రయత్నం చేయాలి.

మిగులు మొత్తం పెంచుకొని, అదనపు ఈఎంఐలు చెల్లించేలా ప్రణాళిక వేసుకోవాలి. దీనివల్ల మీ రుణ భారం తగ్గుతుంది.

రుణాలకు అధిక వడ్డీ చెల్లిస్తూ, తక్కువ రాబడి వచ్చే పథకాల్లో డబ్బును పెట్టడం మంచిది కాదు. అలాంటివేమైనా ఉంటే, వాటిని వెనక్కి తీసుకొని, అప్పు చెల్లించేందుకు ప్రయత్నించండి.

# జీఎస్‌టీ ఎఫెక్ట్: ఈ బైక్ ధరలు భారీగా పెరగనున్నాయ్!

పండుగ సీజన్‌లో వాహనాల ధరలు కొంత తగ్గుతాయి, అప్పుడు నచ్చిన బైక్ కొనుగోలు చేద్దామని కొంతమంది వేచి చూస్తుంటారు. కానీ వారి ఆశలన్నీ ఆవిరైపోయే సమయం వచ్చేసింది. ఎందుకంటే జీఎస్‌టీ పెరుగుదల కారణంగా.. బైక్ ధరలు అమాంతం పెరిగిపోయాయి.ముఖ్యంగా 350సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్స్.. ఆన్ రోడ్ ధరలు ఇప్పుడు 30 శాతం లేదా.. అంతకంటే ఎక్కువ పెరిగే అవకాశం ఉంది. కాగా తక్కువ సామర్థ్యం ఉన్న బైకుల ధరలు తగ్గే అవకాశం ఉంది.ఇప్పటి వరకు అన్ని మోటార్ సైకిల్స్ 28 శాతం జీఎస్‌టీ కింద ఉన్నాయి. అయితే 350 సీసీ బైకులకు 28 శాతం జీఎస్‌టీతో పాటు 3 శాతం సెస్సు కలుస్తుంది. అంటే వీటిపై జీఎస్‌టీ 31 శాతానికి చేరుతుంది. ఇక త్వరలో రాబోయే జీఎస్‌టీ 2.0 విధానంలో రెండు శ్లాబులు (5 శాతం, 18 శాతం) మాత్రమే అందుబాటులో ఉంటాయి. మిగిలినవన్నీ రద్దు అవుతాయి. అయితే 40 శాతం జీఎస్‌టీ అనేది లగ్జరీ వాహనాలకు వర్తిస్తుంది. జీఎస్‌టీ ప్రభావం వల్ల.. బైక్ ధరలు రూ. 20,000 నుంచి రూ. 45,000 వరకు పెరుగుతాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650 ప్రస్తుత ఆన్ రోడ్ ధర రూ. 3.80 లక్షలు. జీఎస్‌టీ కారణంగా దీని ధర రూ. 4.13 లక్షలకు చేరుతుంది. అదే విధంగా కేటీఎం ధర కూడా రూ. 3.60 లక్షల నుంచి రూ. 3.91 లక్షలకు చేరుతుంది. ట్రయంఫ్, బజాజ్, ఏప్రిలియా, హార్లే డేవిడ్సన్ వంటి బైకుల ధరలు కూడా పెరుగుతాయి.






# మార్కెట్లకు మళ్లీ నష్టాలే.. 80వేల దిగువకు సెన్సెక్స్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల బాట కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, టారిఫ్ ఆందోళనలను సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లోనూ మార్కెట్లు ఆద్యంతం ఊగిసలాడి చివరకు నష్టాలను మూటగట్టుకున్నాయి. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 80వేల మార్క్‌ను కోల్పోయింది. నిఫ్టీ 24,500 దిగువకు పడిపోయింది.

ఈ ఉదయం సెన్సెక్స్ 80,010 వద్ద లాభాలతో ప్రారంభమైంది. ఒక దశలో 80,300 మార్క్‌ను దాటి ట్రేడ్ అయ్యింది. అయితే, ఆ జోరు ఎంతోసేపు కొనసాగలేదు. దిగ్గజ రంగాల షేర్లలో అమ్మకాలు సూచీలు కుదిపేశాయి. దీంతో 79,741.76 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరకు 270.92 పాయింట్ల నష్టంతో 79,809.65 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 74.05 పాయింట్లు తగ్గి 24,426.85 వద్ద స్థిరపడింది.

నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అపోలో హాస్పిటల్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

టారిఫ్‌ల ఎఫెక్ట్‌లతో రూపాయి విలువ దారుణంగా పతనమైంది. తొలిసారి 88 మార్క్ దాటింది. నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 61 పైసలు క్షీణించి 88.19 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటికే రూపాయి విలువ 3శాతం పడిపోవడం గమనార్హం

# జియో ఫ్రేమ్స్.. జియో పీసీ.. హాట్‌స్టార్‌లో వాయిస్ ప్రింట్!




రిలయన్స్ వార్షిక సాధారణ సమావేశంలో ఎప్పటిలానే కీలక ప్రకటనలు వెలువడ్డాయి. టీవీని కంప్యూటర్‌గా మార్చుకునే జియో పీసీ.. జియో ఫ్రేమ్స్ పేరిట స్మార్ట్ గ్లాసెస్‌ను తీసుకొస్తున్నట్లు ముకేశ్ అంబానీ తనయుడు ఆకాశ్ అంబానీ వెల్లడించారు. దీంతో పాటు జియో హాట్‌స్టార్‌కు ఏఐ సొబగులు అద్దుతూ మరికొన్ని కొత్త ఫీచర్లను జోడిస్తున్నట్లు తెలిపారు.

జియో హాట్‌స్టార్‌లో కొత్త ఫీచర్స్

రిలయన్స్, వాల్ట్ డిస్నీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ రెండో అతిపెద్ద వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌గా అవతరించిందని ఆకాశ్ అంబానీ తెలిపారు. ఇతర దేశాలకూ విస్తరిస్తామని చెప్పారు. అలాగే, జియోస్టార్‌లో రియా పేరుతో కొత్త ఏఐ అసిస్టెంట్‌ను జోడిస్తున్నట్లు తెలిపారు. ఇది కంటెంట్‌ను వెతకడానికి దోహదపడుతుందని చెప్పారు. మీకు కావాల్సిన ఎపిసోడ్స్‌ను స్క్రోల్ చేయకుండా వాయిస్ కమాండ్స్‌తో సెర్చ్ చేయొచ్చని తెలిపారు. దీంతో పాటు 'వాయిస్ ప్రింట్' అనే మరో ఏఐ టూల్‌ను కూడా జోడిస్తున్నట్లు తెలిపారు. వాయిస్ క్లోనింగ్, లిప్‌సింక్ టెక్నాలజీ ద్వారా నచ్చిన భారతీయ భాషలో నటులు, ప్లేయర్లు మాటలు వినొచ్చని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. దీంతో పాటు మ్యాక్స్‌వ్యూ 3.0ను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు.

జియో పీసీ

జియో పీసీకి సంబంధించి కూడా ఏజీఎంలో ప్రకటన వెలువడింది. టీవీని సులువుగా పర్సనల్ కంప్యూటర్‌గా మార్చుకోవచ్చని జియో ప్రతినిధి తెలిపారు. కేవలం కీబోర్డును జియో సెటాప్‌నకు కనెక్ట్ చేసుకుని మీ టీవీని వర్చువల్ కంప్యూటర్‌గా మార్చుకోవచ్చు. ఎంతవాడితే అంతకే చెల్లించాలని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. మీ అవసరాలకు అనుగుణంగా ఎక్కడి నుంచైనా ఈ క్లౌడ్ పీసీని యాక్సెస్ చేయొచ్చని తెలిపారు. ఈ పీసీ ఎప్పుడూ అప్‌టుడేట్‌గా ఉంటుందని తెలిపారు. కావాలంటే మెమొరీ, స్టోరేజీ, కంప్యూటింగ్ పవర్‌ను అవసరాలకు అనుగుణంగా పెంచుకోవచ్చన్నారు.

జియో ఫ్రేమ్స్

ఏజీఎం వేదికగా జియో ఫ్రేమ్స్ పేరిట స్మార్ట్ కళ్లజోడును ఆకాశ్ అంబానీ ప్రకటించారు. దీని సాయంతో కాల్స్ చేసుకోవచ్చు. ఫొటోలు తీసుకోవచ్చు. ఎలాంటి ఇయర్‌ఫోన్స్ లేకుండానే మ్యూజిక్‌ను ఆనందించొచ్చు. ఇందులో బిల్ట్ ఇన్‌గా జియో వాయిస్ ఏఐ ఉంటుంది. ఈ స్మార్ట్‌గ్లాస్ అన్ని భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది. అయితే, జియో ఫ్రేమ్స్ ధర, ఇతర వివరాలు వెల్లడించలేదు. రేబన్ ఇప్పటికే ఈ తరహా స్మార్ట్‌గ్లాసెస్‌ను దేశీయ మార్కెట్‌లోకి రూ.29,900కు లాంచ్ చేసింది. దీని ధర ఎంత నిర్ణయిస్తారో చూడాలి. జియో వెబ్‌సైట్‌లో ఇంట్రెస్ట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ అందుబాటులోకి తెచ్చారు.

# ఈసారి ఐఫోన్ 17 సిరీస్ ధరల పెంపు..! ఎంత ఉండొచ్చంటే..?



టెక్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐఫోన్ 17 సిరీస్ ఫోన్లు సెప్టెంబర్ 9న లాంచ్ కానున్నాయి. ఈ సిరీస్‌లో నాలుగు మోడల్స్ రానున్నట్లు తెలుస్తోంది. వీటిల్లో ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ఉండనున్నట్లు సమాచారం. అయితే.. గతంతో పోల్చితే ఈసారి వచ్చే మోడళ్లలో భారీ అప్‌గ్రేడ్‌లు ఉంటాయని.. ఈ కారణంగా ధరల పెరుగుదలకు అవకాశముందని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.ఇటీవల ఐఫోన్ 17, ఐఫోన్ 17 ప్రో మోడళ్ల అమెరికా ధరలు లీకయ్యాయి.దాదాపు 50డాలర్ల పెంపు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సిరీస్‌లో వచ్చే ఫోన్లు మరింత ఖరీదు కానున్నట్లు సమాచారం. లీకైన వివరాలను బట్టి ఐఫోన్ 17 సిరీస్ ధరలు ఎంత ఉండొచ్చంటే..?

ఐఫోన్ 17 128జీబీ వేరియంట్ ధర ఈసారి $849 లేదా ₹84,990 ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గత ఐఫోన్ 16ప్రో ధర $999 గా ఉండగా.. ఈసారి ఐఫోన్ 17 ప్రో ధర $1,049 లేదా ₹1,24,990 ఉండనున్నట్లు సమాచారం.

ఇక ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ధర $1,249 లేదా ₹1,50,000కు పెరగవచ్చని సమాచారం.

# జీఎస్‌టీ ఎఫెక్ట్: ఈ బైక్ ధరలు భారీగా పెరగనున్నాయ్!

పండుగ సీజన్‌లో వాహనాల ధరలు కొంత తగ్గుతాయి, అప్పుడు నచ్చిన బైక్ కొనుగోలు చేద్దామని కొంతమంది వేచి చూస్తుంటారు. కానీ వారి ఆశలన్నీ ఆవిరైపోయే సమయం వచ్చేసింది. ఎందుకంటే జీఎస్‌టీ పెరుగుదల కారణంగా.. బైక్ ధరలు అమాంతం పెరిగిపోయాయి.ముఖ్యంగా 350సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్స్.. ఆన్ రోడ్ ధరలు ఇప్పుడు 30 శాతం లేదా.. అంతకంటే ఎక్కువ పెరిగే అవకాశం ఉంది. కాగా తక్కువ సామర్థ్యం ఉన్న బైకుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అన్ని మోటార్ సైకిల్స్ 28 శాతం జీఎస్‌టీ కింద ఉన్నాయి. అయితే 350 సీసీ బైకులకు 28 శాతం జీఎస్‌టీతో పాటు 3 శాతం సెస్సు కలుస్తుంది. అంటే వీటిపై జీఎస్‌టీ 31 శాతానికి చేరుతుంది. ఇక త్వరలో రాబోయే జీఎస్‌టీ 2.0 విధానంలో రెండు శ్లాబులు (5 శాతం, 18 శాతం) మాత్రమే అందుబాటులో ఉంటాయి. మిగిలినవన్నీ రద్దు అవుతాయి. అయితే 40 శాతం జీఎస్‌టీ అనేది లగ్జరీ వాహనాలకు వర్తిస్తుంది.జీఎస్‌టీ ప్రభావం వల్ల.. బైక్ ధరలు రూ. 20,000 నుంచి రూ. 45,000 వరకు పెరుగుతాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650 ప్రస్తుత ఆన్ రోడ్ ధర రూ. 3.80 లక్షలు. జీఎస్‌టీ కారణంగా దీని ధర రూ. 4.13 లక్షలకు చేరుతుంది. అదే విధంగా కేటీఎం ధర కూడా రూ. 3.60 లక్షల నుంచి రూ. 3.91 లక్షలకు చేరుతుంది. ట్రయంఫ్, బజాజ్, ఏప్రిలియా, హార్లే డేవిడ్సన్ వంటి బైకుల ధరలు కూడా పెరుగుతాయి.



# అందుకే అతడిని నా భర్త అని చెప్పాను: జాన్వీకపూర్



'పరమ్ సుందరి'తో ప్రేక్షకులను పలకరించారు నటి జాన్వీకపూర్ . ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఓ సరదా విషయాన్ని పంచుకున్నారు. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ 'స్పీడ్ డేటింగ్' అంటూ ఓ ఫన్నీ ఇంటర్వ్యూ నిర్వహించింది. అందులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ వారి మొదటి ప్రేమ, డేటింగ్ గురించి ఏదైనా విషయాలను వెల్లడించాలి. ఈ ఇంటర్వ్యూలో జాన్వీ మాట్లాడుతూ విదేశాలకు వెళ్లినప్పుడు యువకులు తన వెంటపడకుండా ఉండేందుకు తనకు పెళ్లి అయినట్లు చెబుతానన్నారు.

"నేను ఇప్పటికి చాలాసార్లు నాకు వివాహం అయిందని చెప్పాను. విదేశాలకు వెళ్లినప్పుడు చాలా మంది యువకులు నాతో చనువుగా ఉండడానికి ప్రయత్నించేవారు. కొన్ని సార్లు రిసార్ట్‌స్‌కు, హోటల్స్‌కు వెళ్లినప్పుడు నేను అడగకుండానే ప్రత్యేకమైన వంటకాలను తెచ్చి ఇచ్చేవారు. ఒకసారి నేను లాస్‌ఏంజిల్‌స్‌కు వెళ్లాను. అక్కడ హోటల్ వాళ్లకు ఓర్రీ నా భర్త అని చెప్పా" అంటూ సరదాగా పంచుకున్నారు. ఇక ఓర్రీ బాలీవుడ్‌తో పాటు సినీ ప్రియులందరికీ పరిచయమే.. ఫ్యాషన్ డిజైనర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఎంతో మంది ప్రముఖులతో అతడు క్లోజ్‌గా ఉంటాడు. బాలీవుడ్ స్టార్స్ చాలామందికి అతడు స్నేహితుడు.

అలాగే ఒకసారి తనను కలవడం కోసం ఓ వ్యక్తి లండన్ నుంచి ముంబయికి ప్రయాణం చేసి వచ్చినట్లు కల వచ్చిందని జాన్వీ కపూర్ చెప్పారు. ఉలిక్కిపడి నిద్రలేచినట్లు తెలిపారు. ఇక ప్రేమపై తన అభిప్రాయాన్ని పంచుకున్న జాన్వీ.. ప్రేమ అంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర అంగీకారమని.. కష్టసుఖాల్లో తోడు నిలవడమే తన దృష్టిలో నిజమైన ప్రేమ అని తెలిపారు.





# బడ్జెట్ రూ.40 కోట్లు.. కలెక్షన్స్ రూ.300 కోట్లు.. యానిమేషన్‌లో రికార్డు



యానిమేషన్ సినిమాలకు హాలీవుడ్‌లో ఉన్నంత క్రేజ్ మన దగ్గర లేదు. నటుల్లేని సినిమా, వీఎఫ్ఎక్స్ ఆధారిత చిత్రం అనగానే అది కేవలం పిల్లల కోసమే అనే మాట ఎక్కువగా వినిపించేది. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసింది 'మహావతార్ నరసింహ'. ప్రమోషన్స్ ఊసు లేకపోయినా మౌత్‌టాక్‌తోనే ఘన విజయం సాధించింది. అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ యానిమేషన్ మూవీగా ఇప్పటికే రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. తాజాగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకుపైగా కలెక్షన్స్ (గ్రాస్) చేసిందని తెలియజేస్తూ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ఆనందం వ్యక్తం చేసింది.'అద్భుతం జరిగేటప్పుడు ఎవరూ గుర్తించరు. జరిగాక గుర్తించాల్సిన అవసరం లేదు'.. 'ఖలేజా'లోని ఈ డైలాగ్ గుర్తుంది కదా. అది 'మహావతార్ నరసింహ'కు బాగా సరిపోతుంది. దర్శకుడు అశ్విన్ కుమార్ ఈ సినిమా ప్రకటించిన సమయంలో.. 'ఈ రోజుల్లో యానిమేషన్ చిత్రాలు ఎవరు చూస్తారు?' అంటూ నవ్విన వారూ లేకపోలేదు. పైగా దర్శకత్వంలో ఆయనకు అనుభవమూ లేదు. అయినా నిరుత్సాహపడకుండా తన కలల ప్రాజెక్టును పట్టాలెక్కించారు. సుమారు నాలుగేళ్ల ప్రయాణంలో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా వెనుకడుగు వేయలేదు. దర్శకుడి విజన్‌ను నమ్మిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ రూ. 40 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాని రూపొందించింది. జులై 25న ఇండియాలో విడుదలైంది. తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్ మొదలైంది. సాక్షాత్తూ నరసింహ స్వామే ప్రత్యక్షమయ్యాడా? అన్నంత సహజంగా ఉన్న విజువల్స్‌కు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. ఇక్కడ విజయం అందుకున్న అనంతరం, విదేశాల్లో రిలీజ్ చేయగా అక్కడా అదే పరిస్థితి.ఎన్ని రోజులు ఆడిందన్న ప్రాతిపదికన ఒకప్పుడు సినిమా విజయం ఆధారపడేది. ఇప్పుడది కలెక్షన్‌స్‌కు మారింది. స్టార్ హీరోల నటించిన సినిమాలు హిట్ అవుతున్నా.. వాటి రన్ తక్కువే. కానీ, 'మహావతార్ నరసింహ' రిలీజై 30 రోజులు దాటినా పలు కేంద్రాల్లో హవా కొనసాగిస్తోంది. 8 రోజుల్లోనే రూ.60.5 కోట్ల వసూలుతో యానిమేషన్ చిత్రాల జాబితాలో అరుదైన రికార్డు నెలకొల్పిన 'మహావతార్ నరసింహ'కు కొనసాగింపు చిత్రాలు రానున్నాయి. 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా రెండేళ్లకు ఒకటి చొప్పున మొత్తం ఏడు సినిమాలు తెరకెక్కనున్నాయి.

# త్రిబాణధారి బార్బరిక్.. సత్యరాజ్, ఉదయ భానుల

## మూవీ ఎలా ఉంది?

**చిత్రం: త్రిబాణధారి బార్బరిక్; నటీనటులు: సత్యరాజ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్.సింహ, సత్యం రాజేశ్, సాంచీ రాయ్, వీటీవీ గణేశ్, క్రాంతి కిరణ్, మేఘన తదితరులు; సంగీతం: ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్; ఛాయాగ్రహణం: కుశేందర్ రెడ్డి; రచన, దర్శకత్వం: మోహన్ శ్రీవత్స; నిర్మాత: విజయ్ పాల్ రెడ్డి అడిదెల; విడుదల తేదీ: 29-08-2025**

**కథేంటంటే..**

శ్యామ్ కతు (సత్యరాజ్) పేరు మోసిన మానసిక వైద్య నిపుణుడు. కొడుకు, కోడలు చనిపోవడంతో మనవరాలు నిధి (మేఘన)ని అల్లారు ముద్దుగా పెంచుకుంటుంటాడు. ఓరోజు స్కూల్‌కు వెళ్లిన ఆ పాప కనిపించకుండా పోతుంది. దీంతో శ్యామ్ పోలీసుల్ని ఆశ్రయించగా.. వాళ్లు మిస్సింగ్ కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతారు. మరి ఆ తర్వాత ఏమైంది? శ్యామ్ మనవరాలు కనపడకపోవడానికి కారణమెవరు? దీనికి ఆ ఊరిలో ఉన్న రామ్ (వశిష్ఠ ఎన్ సింహా), లేడీ డాన్ వాకిలి పద్మ (ఉదయభాను)కు ఏమైనా సంబంధం ఉందా? డబ్బు కోసం వీళ్లిద్దరూ చేస్తున్న అక్రమ కార్యకలాపాలేంటి? ఆఖరికి తన మనవరాలి మిస్సింగ్ కేసును శ్యామ్ ఛేదించాడా? లేదా? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి.

**ఎలా సాగిందంటే..**

ఈ చిత్ర విషయంలో అందరి దృష్టినీ బాగా ఆకర్షించింది తొలుత టైటిలే. మహాభారతంలోని ఘటోత్కచుడి కొడుకు బార్బరీకుడి పాత్ర ఆధారంగా పేరు పెట్టడంతో.. ఎవరికీ అంతగా పరిచయం లేని ఈ శక్తిమంతమైన పాత్రతో ఎలాంటి కథ చెప్పనున్నాడో అనే ఆసక్తి అందరిలో కలిగింది. కానీ, అదే అంచనాలతో ప్రేక్షకులు థియేటర్లలోకి అడుగు పెడితే భంగపాటుకు గురికాక తప్పదు. ఎందుకంటే ఈ చిత్రానికి మైథలాజికల్ టచ్ ఇచ్చినప్పటికీ.. అది కేవలం ఓ చిన్న లేయర్‌గానే ఉంటుంది. ప్రధానంగా ఇది మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గానే సాగుతుంది. కథలో మరీ కొత్తదనమేమీ కనిపించకున్నా.. స్క్రీన్‌ప్లేతో ప్రథమార్ధాన్ని థ్రిల్లింగానే ముందుకు నడిపించాడు దర్శకుడు. కథ గతానికి.. వర్తమానానికి తిరగడం ఆరంభంలో కాస్త గందరగోళానికి గురి చేసినా.. ఒక్కసారి ఆ పాత్రల ప్రయాణాలతో కనెక్ట్ అయ్యాక ఆ జర్నీ అంతా ఆసక్తిరేకెత్తించేలా ఉంటుంది. మనవరాలితో తనకున్న అనుబంధాన్ని, ఆమె మిస్సయ్యాక ఆ తాత పడే వేదనను భావోద్వేగభరితంగా చూపించలేకపోయారనిపిస్తుంది. మరోవైపు విదేశాలకు వెళ్లి సెటిల్ అవ్వడం కోసం రామ్ చేసే ప్రయత్నాలు.. లేడీ డాన్ వాకిలి పద్మతో చేతులు కలిపి చేసే అక్రమ కార్యకలాపాలు కథలో ఉత్కంఠను రేకెత్తిస్తాయి. శ్యామ్ మనవరాలు మిస్సింగ్‌కు వాళ్లకు ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాన్ని రేకెత్తిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఓ చక్కటి ట్విస్ట్‌తో ప్రథమార్ధానికి విరామమిచ్చిన తీరు బాగుంది. అది ద్వితీయార్ధంపై ఆసక్తిరేకెత్తించేలా చేస్తుంది.ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్ధం కాస్త సాగదీతగా అనిపిస్తుంది. మిస్సింగ్ కేసు మర్డర్ కేసుగా మారడం.. పోలీస్ వ్యవస్థను పక్కకు పెట్టి తన మనవరాలు కోసం శ్యామ్ కతు నేరుగా రంగంలోకి దిగడం ద్వితీయార్ధానికి కీలకం. ఇక ఈ చిత్ర టైటిల్‌లోని బార్బరీకుడి పాత్ర గురించి.. అతని మూడు బాణాల గురించి ఓ నాటక రూపంలో ముచ్చటగా మూడు విజువల్స్‌తో తేల్చేసే ప్రయత్నం చేశారు. అది కథలో బలవంతంగా ఇరికించినట్లు అనిపిస్తుంది. నిధి మిస్సింగ్ కేసులోని ట్విస్ట్ ఊహలకు అందేలాగే ఉంటుంది. కథను ముగించిన తీరు ఫర్వాలేదనిపిస్తుంది.

**ఎవరెలా చేశారంటే..**

శ్యామ్ పాత్రలో సత్యరాజ్ కనిపించిన తీరు.. కేవలం కళ్లతోనే హావభావాల్ని పలికించిన విధానం ఆకట్టుకుంటుంది. వశిష్ఠ పాత్రలో భిన్న కోణాలు కనిపిస్తాయి. అవి ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. లేడీ డాన్‌గా ఉదయభానును తెరపై శక్తిమంతంగా చూపే ప్రయత్నం చేశారు. సత్యం రాజేశ్, సాంచి రాయ్, వీటీవీ గణేశ్, మేఘన తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి.ఓ రొటీన్ క్రైమ్ థ్రిల్లర్ కథను.. పురాణాల్లోని బార్బరీకుడి పాత్రతో ముడిపెట్టి కొత్తగా చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అది కొంతమేరే ఫలితాన్నిచ్చింది. ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ పాటలు, నేపథ్య సంగీతం.. కుశేందర్ రెడ్డి ఛాయాగ్రహణం సినిమాకి బలాన్నిచ్చాయి.

## రివ్యూ

**బలాలు**

+ స్క్రీన్‌ప్లే
+ సత్యరాజ్ నటన
+ కథలోని కొన్ని ట్విస్ట్‌లు

**బలహీనతలు**

- కొరవడిన భావోద్వేగాలు
- ఊహలకందే క్లైమాక్స్

**చివరిగా: అక్కడక్కడా థ్రిల్ చేసే 'త్రిబాణధారి బార్బరిక్'**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టికోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**






# సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్.. ఫొటోలు వైరల్

తమిళ హీరో విశాల్ సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు. హీరోయిన్ సాయిధన్సికతో నిశ్చితార్థం చేసుకున్నాడు. చెన్నైలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుక జరిగింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్త జంటకు అందరూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తమిళం హీరోగా గుర్తింపు తెచ్చుకున్న విశాల్.. హీరోయిన్‌గా చేస్తున్న ధన్సిక ప్రేమించుకున్నారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఓ సినిమా ఫంక్షన్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు. తామిద్దరం ఆగస్టు 29నలో పెళ్లి చేసుకుంటామని చెప్పుకొచ్చారు. కానీ నటుల సంఘం కార్యదర్శిగా ఉన్న విశాల్.. ఆ సంఘ(నడిగర్) భవనం ప్రారంభోత్సవం తర్వాత వివాహం చేసుకోనున్నట్లు చెప్పుకొచ్చాడు. దీంతో చెప్పిన తేదీన ఇప్పుడు నిశ్చితార్థం చేసుకున్నారు. చాలా సింపుల్‌గా ఈ వేడుక జరిగింది.సాయి ధన్సిక.. తమిళనాడు తంజావూరుకి చెందిన అమ్మాయి. 2006లో 'మనతోడు మజైకాలం' అనే తమిళ సినిమాతో నటిగా మారింది. మెరీనా అనే స్క్రీన్ నేమ్‌తో ప్రేక్షకులకు పరిచయమైంది. 2009లో 'కెంప' మూవీతో తనుషిక పేరుతో కన్నడ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత సాయి ధన్సిక పేరుతోనే సినిమాలు చేస్తూ వచ్చింది. 'కబాలి' చిత్రంలో రజనీకాంత్ కూతురిగా నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైంది. 'షికారు' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. 'అంతిమ తీర్పు', 'దక్షిణ' లాంటి స్ట్రెయిట్ తెలుగు మూవీస్ చేసింది.విశాల్‌ధన్సిక ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా కలిసి చేయలేదు. కానీ విశాల్‌తో తనకు 15 ఏళ్ల పరిచయం ఉందని ధన్సిక చెప్పింది. గత కొన్నేళ్లుగా స్నేహితులుగా ఉన్నామని, కొన్నాళ్ల క్రితమే తామిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని చెప్పుకొచ్చింది. ఇప్పుడు నిశ్చితార్థం చేసుకున్నారు. త్వరలో పెళ్లి కబురు కూడా చెబుతారేమో?



# సీఎం సహాయ నిధికి సందీప్ రెడ్డి విరాళం.. వాళ్లపై విమర్శలు

టాలీవుడ్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సీఎం సహాయక నిధికి విరాళాన్ని అందించారు. తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జన జీవనం స్తంభించిపోయింది. ముఖ్యంగా కామారెడ్డి సిద్దిపేట, సిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలను సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఇలాంటి సమయంలో తనవంతుగా సాయం చేసేందుకు దర్శకుడు సందీప్‌రెడ్డి ముందుకు రావాడాన్ని తన అభిమానులు సంతోషిస్తున్నారు.సీఎం రేవంత్ రెడ్డిని సందీప్‌రెడ్డి వంగాతో పాటు తన సోదరుడు ప్రణయ్ రెడ్డి కలుసుకున్నారు. భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున సీఎం సహాయక నిధికి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కుండపోతగా కురిసిన వర్షంతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా టాలీవుడ్ నుంచి ఎవరూ స్పందించలేదు. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటన జరిగితే కోట్ల రూపాయలు ఇచ్చే టాలీవుడ్ సెలబ్రిటీలు ఇప్పుడు తెలంగాణ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ బిడ్డలకు ఆపద వస్తే స్పందించరా అంటూ కామెంట్లతో విరుచుకుపడుతున్నారు. వరంగల్‌కు చెందిన సందీప్‌రెడ్డి వంగా చేసిన సాయంతో అయినా మరికొందరు ముందుకు వస్తారని నెటిజన్లు ఆశిస్తున్నారు.



# నిరూపించుకోవడానికి ఏమీలేదు.. అదే నా విజయ సూత్రం: పీవీ సింధు

ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో తెలుగుతేజం పీవీ సింధు అదరగొట్టింది. వరల్డ్ నంబర్ 2 ప్లేయర్ వాంగ్ యును చిత్తు చేసింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన సింధు మళ్లీ అదే ఫామ్‌తో ఈసారి అడుగు పెట్టింది. గాయాలు ఎదురైనా 'ఫిట్‌నెస్'ను కాపాడుకుని ఈ టోర్నీలో ప్రవేశించింది. భారీ వేదికపై రిథమ్‌ను అందుకోవడానికి పడిన శ్రమకు ప్రతిఫలం దక్కినట్లు సింధు వెల్లడించింది. ఇప్పుడు రెండో ర్యాంకర్‌పై విజయం సాధించడంపై స్పందించింది.

"నేను నిరూపించుకోవడానికి పెద్దగా ఏమీలేదు. నా సత్తా ఏంటో ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో నిరూపించా. ప్రత్యేకంగా ఎవరి కోసమో ఆడాల్సిన అవసరం లేదు. విజేతగా నిలవడంపైనే దృష్టిపెట్టా. అయితే, గత రెండేళ్ల నుంచి నా ఆరంభం గొప్పగా లేదు. కెరీర్‌లో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. గాయపడటం కూడా ఇబ్బందిగా మారింది. గెలవాలని తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యపడలేదు. కానీ, ఫిట్‌నెస్‌పై మరింత దృష్టిసారించి మళ్లీ నూతన ఉత్సాహంతో అడుగు పెట్టా. కేవలం ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం చాలా కష్టపడ్డా. ప్రతి టోర్నీ ముగిసిన తర్వాత.. నేను చేసిన పొరపాట్లు ఏంటో కోచ్‌తో కలిసి చర్చిస్తుంటా. మరోసారి తప్పిదం చేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. ఇప్పుడు ఈ టోర్నీలో దాని ఫలితం కనిపిస్తోంది" అని సింధు వెల్లడించింది.

క్వార్టర్ ఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన పీకే వార్దనితో పీవీ సింధు ఇవాళ తలపడనుంది. ప్రస్తుతం వార్దని ప్రపంచ మహిళా బ్యాడ్మింటన్ విభాగంలో తొమ్మిదో ర్యాంకులో ఉంది. మరోవైపు పీవీ సింధు 15వ స్థానంలో కొనసాగుతోంది. నాకౌట్ దశలో టాప్ ర్యాంకర్లతో సింధు పోటీ పడాల్సి ఉంది. సెమీస్‌లోనూ కఠిన ప్రత్యర్థి తప్పదు. అయితే, ప్రపంచ రెండో ర్యాంకర్‌పైనే గెలిచిన సింధు మిగతా ప్లేయర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం పెద్ద కష్టమేం కాదనేది క్రీడా విశ్లేషకుల అంచనా.



## ఎవరి బౌలింగ్‌లో సిక్స్‌లు కొట్టడమంటే ఇష్టం?: రోహిత్‌కు ఎదురైన ప్రశ్న



తర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్ రోహిత్ శర్మ. మొత్తం 499 మ్యాచుల్లో 637 సిక్స్‌లు బాదాడు. ఇందులో మూడు ఫార్మాట్‌లకు సంబంధించిన ఉన్నాయి. అతడి తర్వాత క్రిస్ గేల్ (553) చాలా దూరంలోనే నిలిచిపోయాడు. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న రోహిత్ శర్మ ఎదుట ఓ ప్రశ్న ఎదురైంది. దానికి అతడు ఇచ్చిన సమాధానమూ ఆసక్తికరంగా ఉండటం గమనార్హం. ఎక్కడా ఏ బౌలర్ పేరునూ ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఇంతకీ అతడి ముందున్న ప్రశ్న ఏంటి? అందుకు రోహిత్ ఇచ్చిన సమాధానం ఏంటి?

రోహిత్: 'నేను ప్రతి బౌలర్ బౌలింగ్‌లో హిట్టింగ్ చేసేందుకు ఇష్టపడతా (ప్రేక్షకులు అంతా చప్పట్లు కొట్టారు). అంటే క్రీజ్‌లోకి వచ్చాక నా మైండ్‌సెట్ మారిపోతుంది. ఎవరు బౌలింగ్ వేస్తున్నారనేది కాకుండా ఆ బంతిని ఎలా సిక్స్‌గా తరలించొచ్చని ఆలోచిస్తా. అంతేకానీ, ప్రత్యేకంగా ఫలానా వారి బౌలింగ్‌లోనే కొట్టాలని అనుకోను. అలాంటి లక్ష్యమే పెట్టుకోను. ప్రతి మ్యాచ్‌లో ప్రతి బౌలర్‌పైనా ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నిస్తా' అని సమాధానమిచ్చాడు.

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం..

టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. అక్టోబర్‌లో టీమ్ ఇండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడనుంది. ఆ సిరీస్ కోసం రోహిత్ సన్నద్ధమవుతున్నాడు. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనేదే అతడి లక్ష్యం. గత ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరినా కప్ కల మాత్రం నెరవేరలేదు. అయితే, ఇంకా రెండేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో రోహిత్ కొనసాగడంపై ఇప్పటికే చర్చ నడుస్తోంది. భారత మేనేజ్‌మెంట్ మాత్రం రోహిత్‌కు ఆసీస్‌తో సిరీస్‌లో అవకాశం ఇచ్చి.. అప్పుడు ఓ నిర్ణయానికి రావాలని చూస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫిట్‌నెస్ టెస్టుకూ హాజరవుతానని బీసీసీఐ దృష్టికి రోహిత్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది

# కోహ్లీ, ధోనీలో ఎవరు బౌన్సర్ చక్కగా ఆడతారంటే.. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్





రాట్ కోహ్లీ , మహేంద్ర సింగ్ ధోనీ .. ఈ ఇద్దరిలో ధోనీనే విదేశీ పిచ్‌లపై బౌన్సర్ బాగా ఆడతాడని న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ నీల్ వాగ్నెర్ కితాబిచ్చాడు. 2014 అక్లాండ్‌లో న్యూజిలాండ్‌తో, టీమ్ఇండియాకు జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ నాటి సంగతులను అతడు పంచుకున్నాడు. ఈ పోరులో షార్ట్‌బాల్ వ్యూహంతో విరాట్ కోహ్లీని.. బోల్తా కొట్టించిన వైనాన్ని గుర్తు చేసుకున్నాడు. అలాగే ధోనీ వికెట్ కూడా అతడికే దక్కింది. అయితే అప్పటి మ్యాచ్‌లో ఓవర్సీస్ కండీషన్స్‌లో బౌన్సర్లను ఎదుర్కోవడంలో విరాట్ కోహ్లీ కన్నా ధోనీ సౌకర్యవంతంగా కనిపించాడని నీల్ వాగ్నెర్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ పోరులో నీల్ వాగ్నెర్ నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. అప్పటికే టీమ్ఇండియా ఇన్నింగ్స్‌లో కీలకమైన బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరారు. క్రీజులో ఉన్న ధోనీ టెయిలెండర్ల సాయంతోనే జట్టును గెలుపు దగ్గరి వరకు తీసుకెళ్లాడు. అతడు మైదానం నలుమూలలా పెద్ద పెద్ద షాట్లు ఆడుతూ టీమ్ఇండియాకు విజయం మీద ఆశలు రేకెత్తించాడు. కానీ, నీల్ వాగ్నెర్ బౌలింగ్‌లో తన వికెట్ కోల్పోయాడు. ఈ మ్యాచ్‌లో వాగ్నెర్ 62 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సొంతం చేసుకున్నాడు. ధోనీ పెవిలియన్‌కు చేరడంతో న్యూజిలాండ్ విజయం ఖాయమైంది. 'విరాట్ కోహ్లీకి నేను సంధించిన బౌన్సర్‌ను పుల్‌షాట్ ఆడబోయి ఫీల్డర్ చేతికి చిక్కాడు. తర్వాత ఎం.ఎస్.ధోనీ, రవీంద్ర జడేజా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే బౌన్సర్లు ధోనీని పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. కానీ ధోనీ వికెట్ కూడా నాకే దక్కింది' అని నీల్ వాగ్నెర్ ఓ పాడ్‌కాస్ట్‌లో వివరించాడు. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 503 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా 202 పరుగులకే ఆలౌటైంది. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ అనూహ్యంగా 105 రన్స్‌కే వికెట్లన్నీ కోల్పోయింది. తర్వాత 407 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా 366 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా ఓపెనర్ శిఖర్ ధావన్ 115 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీ 67, ఎంఎస్ ధోనీ 39 రన్స్ సాధించారు.



## సరికొత్త చరిత్ర.. అరంగేట్రం మ్యాచ్‌లోనే 4 బంతుల్లో 4 వికెట్లు



దులీప్ ట్రోఫీ 2025లో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. ఈ టోర్నీలో నార్త్ జోన్‌కు ఆడుతున్న జమ్మూ కశ్మీర్ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీ దార్ నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలో ఓ బౌలర్ ఈ ఘనత సాధించడం ఇదే మొదటిసారి. ఈ ఘనత సాధించే క్రమంలో ఆకిబ్ నబీ హ్యాట్రిక్ కూడా నమోదు చేశాడు. తద్వారా కపిల్ దేవ్, సాయిరాజ్ బహుతులే తర్వాత దులీప్ ట్రోఫీలో హ్యాట్రిక్ తీసిన మూడో బౌలర్‌గా చరిత్రపుటల్లోకెక్కాడు. దులీప్ ట్రోఫీలో కపిల్ దేవ్ 1978/79 సీజన్‌లో నార్త్ జోన్‌కు ఆడుతూ వెస్ట్ జోన్‌పై హ్యాట్రిక్ సాధించాడు. ఈ టోర్నీ చరిత్రలో ఇదే తొలి హ్యాట్రిక్. ఆతర్వాత 2000/01 సీజన్‌లో సాయిరాజ్ బహుతులే వెస్ట్ జోన్‌కు ఆడుతూ ఈస్ట్ జోన్‌పై హ్యాట్రిక్ నమోదు చేశాడు. తాజాగా ఆకిబ్ నబీ కపిల్, బహుతులే సరసన చేరాడు. నబీకి దులీప్ ట్రోఫీలో ఇదే అరంగేట్రం మ్యాచ్ కావడం మరో విశేషం.28 ఏళ్ల ఆకిబ్ నబీ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. మ్యాచ్ రెండో రోజు (ఆగస్ట్ 29) ఈ ఫీట్ నమోదైంది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో నబీ 53వ ఓవర్ చివరి మూడు బంతులకు వరుసగా విరాట్ సింగ్ (బౌల్డ్), మనిశి (ఎల్బీడబ్ల్యూ), ముక్తర్ హుసేన్ (బౌల్డ్) వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు.

## ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభ వేడక.. ప్రత్యేక ఆకర్షణగా వైభవ్ సూర్యవంశీ



ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 12 నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఇవాళ (ఆగస్టు 29) ఘనంగా ప్రారంభమైంది. వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ వేడుకకు భారత క్రికెట్ యువ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యాడు.

ఇవాళ సాయంత్రమే వైభవ్ విశాఖ నగరానికి చేరుకున్నాడు. నిర్వహకులు అతడికి ఘన స్వాగతం పలికారు. వేడక ప్రారంభానికి ముందు వైభవ్ కాసేపు కబడ్డీ క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడాడు. ఆ తర్వాత కొద్ది సేపు కబడ్డీ కూడా ఆడాడు. అనంతరం వైభవ్ చేతుల మీదుగా ఈవెంట్ లాంచ్ అయ్యింది.

ఈ సందర్భంగా వైభవ్ మాట్లాడుతూ.. క్రీడలు మనకు క్రమశిక్షణ, టీమ్‌వర్క్ నేర్పిస్తాయి. నేషనల్ స్పోర్ట్స్ డే నాకు స్ఫూర్తిదాయకం అని వ్యాఖ్యానించాడు. ఈ వేడుకలో కబడ్డీ దిగ్గజం పర్దీప్ నర్వాల్‌కు (డుబ్కీ కింగ్) ప్రత్యేక సన్మానం జరిగింది. డుబ్కీ కింగ్ PKL చరిత్రలో అత్యధిక రైడ్ పాయింట్లు (1801) సాధించిన ఆటగాడు.

సిక్సర్ల వీరుడు వైభవ్ సూర్యవంశీ, కబడ్డీ కింగ్ పర్దీప్ నర్వాల్‌ను ఒకే వేదికపై కనిపించడంతో క్రికెట్, కబడ్డీ అభిమానులు చాలా ఎంజాయ్ చేశారు. అతి చిన్న వయసులోనే వైభవ్ కబడ్డీని ప్రమోట్ చేయడం చాలామందికి నచ్చింది. వైభవ్‌ను చూసేందుకు విశాఖ వాసులు ఎగబడ్డారు.

8 గంటలకు ప్రారంభమైన తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ పోటీపడుతున్నాయి. అనంతరం 9 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరీ పల్టన్ తలపడతాయి.

ఈ సీజన్‌లో టైబ్రేకర్ విధానం, ప్లే-ఇన్ దశ, నాలుగు నగరాల్లో మ్యాచ్‌లు వంటి కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి.